సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 2 । జూన్ । 2024



బడి బస్సులు భద్రమేనా..?

వేసవి సెలవుల తర్వాత విద్యాసంస్థలు ప్రారంభమవుతుండగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



..రిజర్వేషన్లు ప్రశ్నార్థకమే

ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరిస్తే ఉద్యోగావకాశాలు, రిజర్వేషన్లు ప్రశ్నార్థకమేనని సీఐటీయూ నేత సాయిబాబు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 26°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పగలు, రాత్రి వాతావరణం మాత్రం ఉక్కపోతగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

అత్యవసరమైతేనే బయటకు రండి

● ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర పని ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బయటకు వెళ్లినప్పుడు విధిగా టోపీ, గొడుగు వంటివి ధరించాలని, దాహం వేయకపోయినా తరచూ నీరు తాగుతూ ఉండాలని పేర్కొన్నారు. వీలైనప్పుడల్లా ఓఆర్ఎస్, నిమ్మకాయ నీరు, చల్లటి మజ్జిగ వంటి పానీయాలు తీసుకుంటూ ఉండాలని తెలిపారు. తద్వారా శరీరం డీ హైడ్రేషన్ కాకుండా ఉంటుందని తెలిపారు. సున్నితమైన కాటన్ దుస్తులను ధరించాలని, వడదెబ్బ లక్షణాలు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

'పది' సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, జిల్లాలో 1,612 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లు, 83 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. విద్య, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి సెంటర్‌లో పోలీసు బందోబస్తు, సెంటర్ బయట 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.35 గంటల తర్వాత పరీక్ష హాల్‌లోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్‌టికెట్లు సంబంధిత పాఠశాలలో, వెబ్‌సైట్ నుంచి పొందొచ్చని, అదనపు సమాచారం కోసం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు(9989027943)ను సంప్రదించాలని సూచించారు.

'రాజధాని' చార్జీతో లహరిలో ప్రయాణం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలందించేందుకు లహరి పేరుతో ఏసీ, నాన్ ఏసీ బస్సులను తీసుకురాగా మంచి ఆదరణ లభిస్తోందని ఖమ్మం ఆర్ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈనేపథ్యాన లహరి ఏసీ, నాన్ ఏసీ బస్సుల చార్జీలు ఇక నుండి రాజధాని ఏసీ, సూపర్‌లగ్జరీ బస్సులతో సమానంగా ఉండనున్నాయని వెల్లడించారు. ఖమ్మం డిపో నుండి బెంగళూర్‌కు, సత్తుపల్లి, మణుగూరు డిపోల నుండి బీహెచ్ఈఎల్‌కు, కొత్తగూడెం డిపో నుండి పాల్వంచ–మియాపూర్ వరకు, భద్రాచలం నుండి విశాఖపట్నంకు లహరి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈమేరకు రాజధాని, సూపర్‌లగ్జరీ చార్జీలతో లహరి ఏసీ, నాన్ ఏసీ బస్సుల చార్జీ సమానం కానున్నందున ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

తగ్గిన ఆయిల్‌పాం గెలల ధర

● రైతులకు టన్నుకు రూ.791 మేర నష్టం



అశ్వారావుపేట రూరల్ : ఆయిల్ పాం గెలల ధర టన్నుకు రూ.791 తగ్గినట్లు ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం టన్ను గెలల ధర రూ.14,229 ఉండగా, తాజాగా రూ.13,438గా నిర్ణయించినట్లు చెప్పారు. దీంతో గత నెలతో పోల్చితే టన్నుకు రూ.791 మేర రైతులు నష్టపోనున్నారు.

సంబురాల కాంతులు !



విద్యుత్ లైట్ల వెలుతురులో కలెక్టరేట్



విద్యుత్ దీపాలతో అలంకరించిన సింగరేణి ప్రధాన కార్యాలయం

పండుగలా పదేళ్లు..!

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/ నెట్‌వర్క్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2014 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పరిశీలిస్తే జిల్లా అభివృద్ధి పథంలో వడివడిగా అడుగులు ముందుకేసింది. విద్య, వైద్యం, సాగునీటి రంగాలు, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల వంటి అంశాల్లో ప్రగతి నమోదైంది. ఒకప్పుడు నిధుల లేమితో సమస్యల గూడుగా ఉన్న జిల్లా అభివృద్ధి బాట పట్టింది. ఈ నేపథ్యాన ఆవిర్భావ వేడుకలను కలెక్టరేట్లలో ఆదివారం నిర్వహించనుండగా.. ఉదయం 9 గంటలకు ఖమ్మం, కొత్తగూడెంలో కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల జాతీయ పతాకాలను ఆవిష్కరించి పోలీస్ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ మేరకు పదేళ్ల కాలంలో వివిధ రంగాల్లో ఉమ్మడి జిల్లాలో నమోదైన అభివృద్ధిపై కథనం.



సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం

భక్త రామదాసు ప్రాజెక్టుతో తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్, సూర్యాపేట జిల్లా మోతె, మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలాల్లోని ఆయకట్టుకు నీరు అందుతోంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 58,750 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక గోదావరి జలాలను కృష్ణానది ఆయకట్టులో ఎత్తిపోసేలా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు లక్షల ఎకరాల పైచిలుకు పంటలతో పచ్చదనం పరుచుకోనుంది. పదేళ్ల క్రితం జలసవ్వడితో నిండుకుండల్లా ఉన్న చెరువులు కాలక్రమేణా ఆక్రమణకు గురికావడం, అంతేకాకుండా పూడిపోవడంతో ఆయకట్టు తగ్గింది. ఇక ఆక్రమణలు తొలగించడంతో పాటు ఆయకట్టు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో పూడిక తీయించింది. ఇలా ఖమ్మం జిల్లాలో 1,415 చెరువుల్లో పూడికతీయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు అందుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో రూ.5,485 కోట్లతో 1,660 చెరువులను పునరుద్ధరించగా ఆయకట్టు 33 వేల ఎకరాల నుంచి 1.15 లక్షల ఎకరాలకు పెరిగింది.



భక్తరామదాసు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్

నేడు తెలంగాణ దశమ వార్షికోత్సవం

- రాష్ట్రం ఏర్పడ్డాక వివిధ రంగాల్లో ఉమ్మడి జిల్లా అభివృద్ధి
- సాగునీటి ప్రాజెక్టులు, వైద్య రంగంలో పురోగతి
- జిల్లా విభజన, మండలాలు, నూతన జీపీల ఏర్పాటుతో దరిచేరిన పాలన
- హరితహారంతో పరుచుకున్న పచ్చదనం



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్

ఒకే చోట పలు శాఖలు..

2016 అక్టోబర్ 11న జిల్లాల విభజన జరిగింది. ఖమ్మం నుంచి కొత్తగూడెం కేంద్రంగా భద్రాద్రి జిల్లా ఏర్పడింది. పాత 21 మండలాలతోనే ఖమ్మం జిల్లా ఏర్పడగా.. కొత్తగూడెం జిల్లాలో పాతవి 17 మండలాలు సహా కొత్తగా ఆరు మండలాలు ఏర్పాటయ్యాయి. కాగా, వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలం భద్రాద్రి జిల్లాలో ఉండగా.. భద్రాద్రి జిల్లా ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలాన్ని ఖమ్మం జిల్లాలో చేర్చారు. అనంతరం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో నూతన కలెక్టరేట్ నిర్మాణం చేసి 32 శాఖలను ఒకే చోటకు చేర్చగా, భద్రాద్రి జిల్లా కలెక్టరేట్‌ను కొత్తగూడెం–పాల్వంచ పట్టణాల మధ్య నిర్మించి 45 శాఖలను ఒకే చోటకు చేర్చడంతో ప్రజాపాలన మరింత చేరువైంది. అంతేకాక ఖమ్మం జిల్లాలో కొత్తగా 167, భద్రాద్రి జిల్లాలో 276 గ్రామపంచాయతీలు ఏర్పడడంతో పాలన ప్రజల దరికి చేరింది.

'బడి' బాగుపడింది..

విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంది. తొలి విడతగా మన ఊరు – మన బడి కింద ఖమ్మం జిల్లాలో 426 పాఠశాలలు అభివృద్ధి చెందగా, భద్రాద్రి జిల్లాలో 368 పాఠశాలలను ఎంపిక చేసి 275 స్కూళ్లను తీర్చిదిద్దారు. మరో 96 పాఠశాలల్లో పనులు చురుగా సాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల నిర్మాణం, ఫర్నిచర్ వంటి వసతులు సమకూర్చారు. ఆ తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఖమ్మం జిల్లాలో 753 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 217 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. కాగా, పాలేరు నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కావడంతో సాంకేతిక విద్య అందుబాటులోకి రానుంది.



సుందరంగా తయారైన కొత్తగూడెం మేదరబస్తీలోని ప్రాథమిక పాఠశాల

పచ్చని హారం



తెలంగాణ పచ్చని హారంగా మారాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2015లో హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. తొమ్మిది విడతల్లో అన్ని ప్రభుత్వ శాఖలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమం నిరంతరంగా సాగుతుండడంతో జిల్లాలో అటవీ ప్రాంతం పునరుజ్జీవం పొందింది. ఖమ్మంలో జిల్లాలో 63,941.900 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉండగా, భద్రాద్రి జిల్లాలో 10.13 లక్షల ఎకరాల అటవీ విస్తీర్ణం ఉంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 35 రిజర్వు ఫారెస్ట్ బ్లాక్‌లకు గాను 20 ఫారెస్ట్ బ్లాక్‌ల్లో మొక్కలు నాటి పునరుజ్జీవం పోశారు. 2015 నుంచి 2023 వరకు 15,71,72,000 మొక్కలు నాటడం లక్ష్యం కాగా.. 10,34,74,000 మొక్కలను నాటారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణపైనా దృష్టి సారించారు. ఇక ఈ ఏడాది 2024లో 31.06 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. భద్రాద్రి జిల్లాలో 2015 నుంచి 2023 వరకు 1064.82 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 1161.20 లక్షల మొక్కలు నాటారు. ఈ ఏడాది 46.60 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు.

చేరువైన వైద్యం

పదేళ్ల సమయంలో వైద్య రంగం బాగా మెరుగుపడింది. ఖమ్మం, కొత్తగూడెంకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయి. వైద్య విద్య అందుబాటులోకి రావడమే కాక జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మరింతగా పెరిగాయి. అలాగే, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, మధిర, వైరా, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేట, చర్ల ప్రభుత్వ ఆస్పత్రులు అప్‌గ్రేడ్ అయ్యాయి. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగడంతో పాటు గుండె సంబంధిత సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.



ప్రభుత్వ వైద్య కళాశాల

రూపు మారిన పట్టణాలు

పాత జిల్లా కేంద్రమైన ఖమ్మంలో కొత్త కార్పొరేషన్, బస్టాండ్ నిర్మాణమే కాక లకారం ట్యాంక్‌బండ్, నగరం చుట్టూ రెండు వరుసల రహదారులు, డివిజన్‌కో పార్కుతో కొత్త అందం సంతరించుకుంది. ఎన్‌టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్, కాల్వొడ్డు, జెడ్పీ సెంటర్లను అందంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు మురికి కూపంగా ఉన్న గోళ్లపాడు చానల్ పార్కుల మయమైంది. గోళ్లపాడు చానల్‌ను అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీగా ఆధునికీకరించి.. పైన పార్కులు, బస్తీ దవాఖానా, గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. నగర వాసులకు అనుకూలంగా వాకింగ్ ట్రాక్‌లను నిర్మించారు. ఇదేవిధంగా కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ పట్టణాల్లోనూ పార్క్‌లు, కూడళ్ల అభివృద్ధి జరిగాయి.



ఇల్లెందు మెయిన్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్

ముస్తాబైన ప్రకాశం స్టేడియం

- సింగరేణి ఆధ్వర్యంలో వేడుకలు
- హాజరు కానున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ప్రకాశం స్టేడియాన్ని ముస్తాబుచేశారు. వేడుకల కోసం సంస్థ రూ. 37 లక్షలు కేటాయించగా ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సింగరేణి సీఎండీ ఎస్.బలరామ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వేడుకల ఏర్పాట్లను సింగరేణి వెల్ఫేర్ జీఎం బీఆర్ దీక్షితులు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 8 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో పతాకావిష్కరణ, 8.20 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు, అమరవీరుల స్థూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు వివరించారు. 8.30 గంటలకు ప్రకాశం స్టేడియంలో సీఎండీ పతాకావిష్కరణ చేస్తారని, స్కౌట్స్ అండ్ గైడ్స్ మార్చ్‌ఫాస్ట్, సింగరేణి సెక్యూరిటీ కవాతు నిర్వహిస్తారని తెలిపారు.



వేడుకలకు సిద్ధమైన ప్రకాశం స్టేడియం

విత్తనాలు సరిపడా ఉన్నాయ్..

- రైతులు ఆందోళన చెందొద్దు
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు
- డీఏఓ బాబూరావు

ఇల్లెందు /గుండాల : జిల్లాలో విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు తెలిపారు. శనివారం ఆయన ఇల్లెందు, గుండాలలో ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 20 శాతం మేర పత్తి సాగు పెరుగుతుందని, అయినా విత్తనాలు సరిపడా ఉన్నాయని చెప్పారు. ఎవరైనా విత్తనాలు బ్లాక్ చేసినా, నకిలీ విత్తనాలు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాగు వెనుకపడుతుందనే ఆరాటంతో పొడి దుక్కుల్లో విత్తనాలు వేయొద్దని రైతులకు సూచించారు. కనీసం 60 మి. మీ. వర్షపాతం నమోదై భూమి తేమగా ఉన్నప్పుడే విత్తనాలు వేయాలన్నారు. ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే భూమికి బలం పెరుగుతుందని తెలిపారు. రైతులు లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, డీలర్లు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని అన్నారు. ఆయన వెంట రెండు మండలాల ఏఓలు సతీష్, వెంకటేశ్వర్లు, ఇల్లెందు టెక్నికల్ ఏఓ సాయినారాయణ, గుండాల ఏఈఓ బాలరాజు, లెనిన్ ఉన్నారు.



ఇల్లెందులోని ఓ దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీఏఓ తదితరులు

భజే వాయుపుత్రమ్..



భద్రాద్రి రామాలయంలో లడ్డూ కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ

- భద్రగిరిలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- ఆలయానికి పోటెత్తిన అంజన్న భక్తులు
- మళ్లీ మొదటికొచ్చిన లడ్డూలు, కౌంటర్ల సమస్య

భద్రాచలం: రామయ్య పాదదాసుడు అంజన్న జయంతి ఉత్సవాలు భద్రగిరిలో ఘనంగా జరిగాయి. హనుమాన్ మాలధారులు ఇరుముడి విరమణ కోసం భద్రాచలం బాట పట్టారు. దీంతో శుక్ర, శనివారాల్లో భద్రగిరి వీధులన్నీ మాలధారులతో కాషాయ వర్ణపూరితం అయ్యాయి. గోదావరి తీరం, రామాలయం, ఉపాలయాలు భక్తుల సందడితో రద్దీగా మారాయి. 'జై శ్రీరామ్.. జై హనుమాన్' నామస్మరణలతో మార్మోగాయి. హనుమజ్జయంతిని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ఉదయం అభిషేకం, తమలపాకులతో అర్చన, సుందరకాండ పారాయణం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారితో పాటు ఆంజనేయస్వామికి కూడా తిరువీధి సేవ గావించా రు. మాలధారులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి బారులుదీరారు. దీంతో క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి.

లడ్డూలు, కౌంటర్లతో మళ్లీ ఇబ్బందులు..

గతేడాది భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో లడ్డూల కొరత ఏర్పడి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆలయంలోని కౌంటర్ల వద్ద తీవ్ర తొక్కిసలాట జరిగింది. అయితే ఈ ఏడాది భక్తులకు తగినట్లుగా లక్షన్నర లడ్డూలను తయారు చేసినప్పటికీ అవి సరిపోలేదు. శనివారం సైతం లడ్డూల కొరత ఏర్పడింది. ఇక లడ్డూల విక్రయానికి కౌంటర్లను పెంచకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆలయ ప్రాంగణంలోని కౌంటర్లు మినహా అదనంగా ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కువ మంది భక్తులు స్వామి వారి ప్రసాదాలు కొనుగోలు చేయకుండానే వెనుదిరిగారు. దీనికి తోడు ఎండ, ఉక్కపోతతో కౌంటర్ల వద్ద ఉన్న మాలధారులు సైతం తీవ్ర ఇక్కట్లు పడ్డారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

వైభవంగా సువర్ణ తులసీ అర్చన

దేవస్థానంలో శనివారం స్వామివారి మూలమూర్తులకు సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యకల్యాణ వేడుకలో 63 జంటలు పాల్గొన్నాయి.

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం..

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సుదర్శన హోమం, సుదర్శన పుష్పార్చన, పూజలు ఉంటాయని పేర్కొన్నారు. అభయాంజనేయస్వామి ఉపాలయ ప్రాంగణం పక్కన సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరపనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్



సంతలో తనిఖీ చేస్తున్న మనోహర్

టేకులపల్లి : వస్తువుల కొనుగోళ్లలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి కె.మనోహర్ అన్నారు. టేకులపల్లిలోని వార సంతలో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. కూరగాయలు, మాంసం, పండ్ల దుకాణాల్లోని తూకపు బాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యాపారులు తూకాల్లో వినియోగదారులను మోసగిస్తే చర్య తప్పదని హెచ్చరించారు. బరువు తక్కువగా ఉన్నట్లు వినియోగదారులు గమనిస్తే తక్షణమే వ్యాపారులను ప్రశ్నించాలని సూచించారు. తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్స్ తీసుకోవాలని వ్యాపారులను ఆదేశించారు.

30 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాల్వంచరూరల్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి కలిమెల బ్లాక్ పాపులురు చింతగునల్ గ్రామానికి చెందిన మూడ కార్తీక్, మూడ వెంకట్రావు బ్యాగుల్లో గంజాయిని తీసుకుని విజయవాడకు బయల్దేరారు. ఈ క్రమంలో శనివారం పాల్వంచ సీ కాలనీ గేటు కారుషెడ్ వద్ద నిరీక్షిస్తున్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐలు రాము, స్వప్నలకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా, వారి బ్యాగుల్లో రూ.7.50 లక్షల విలువైన 30 కేజీల గంజాయి లభ్యమైంది. ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

భద్రాచలంఅర్బన్: ఎండల తీవ్రతతో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలో ఏఎస్ఆర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన మంటలతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధంకాగా, స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. సుభాష్‌నగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి చెట్టుకొమ్మ విరిగి పడి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో కాలనీలో దాదాపు 40 నిమిషాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

స్మగ్లర్ల వాహనమంటూ...


వెంబడించడంతో ప్రమాదం

కారేపల్లి: స్మగ్లర్లు వాహనంలో వెళ్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇంకో వాహనంలో వెంబడించారు. ఈ క్రమాన రెండు వాహనాలు ఢీకొని ధ్వంసమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. భద్రాద్రి జిల్లా పాతపాల్వంచకు చెందిన మేడేపల్లి విజయ్‌కుమార్ తన కారులో ఇల్లెందు మీదుగా హైదరాబాద్ వెళ్తున్నాడు. ఇల్లెందు – ఖమ్మం ప్రధాన రహదారిలోని ఓసీ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేస్తుండగా విజయ్‌కుమార్ కారు వెళ్తుండటంతో అనుమానం వచ్చిన అధికారులు ఆయన కారును మరో వాహనంలో వెంబడించారు. ఈ క్రమాన గాంధీపురం రైల్వేగేట్ వేసి ఉండటంతో ఆయన కారును గాడెపాడు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లేందుకు వెనక్కి తిప్పుతుండగా అప్పటికే వెంబడిస్తూ వచ్చిన అధికారుల వాహనం ఢీకొంది. దీంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ఆపై విజయ్‌కుమార్ వాహనంలో తనిఖీ చేయగా అనుమానాస్పద వస్తువులేమీ లభించలేదు. దీంతో ఆయన తమ వాహనాన్ని ఢీకొట్టాడని వాహనంతో సహా కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించగా.. అధికారులే తన కారును ఢీకొట్టారని విజయ్‌కుమార్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: నడిచి వెళ్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన శనివారం కొత్తగూడెం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. రామవరం నెహ్రూబస్తీకి చెందిన కోరి ధన్‌రాజు(55) బజ్జీల షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. త్రీ ఇంక్లైన్‌లోని బంధువుల వద్దకు వెళ్లి శనివారం రాత్రి 9 గంటలకు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రుద్రంపూర్‌కు చెందిన వ్యక్తి బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతో ధన్‌రాజ్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య సరిత, కుమారుడు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

బడి బస్సులు భద్రమేనా..?

- గత నెల 15తో ముగిసిన ఫిట్‌నెస్ గడువు
- మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం
- ఇప్పటివరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని యాజమాన్యాలు
- పట్టించుకోని జిల్లా రవాణాశాఖ అధికారులు



జిల్లా రవాణాశాఖ కార్యాలయం

కొత్తగూడెంటౌన్: వేసవి సెలవుల అనంతరం జూనియర్ కళాశాలలు శనివారం నుంచి తిరిగి ప్రారంభమయ్యాయి. మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభంకాబోతున్నాయి. కానీ ఇప్పటివరకు విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయలేదు. కండిషన్ చెక్ చేయలేదు. చిన్నారుల భద్రత దృష్ట్యా జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టితో బడి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని పాఠశాలలకు, కళాశాలలకు 328 బస్సులు ఉన్నాయి. ప్రతి ఏటా విద్యాసంస్థల బస్సులను ఆయా యాజమాన్యాలు జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. కండిషన్ సరిగ్గా ఉంటేనే ఆర్టీఏ అధికారులు రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఇస్తారు. గత మే 15వ తేదీతో విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌టెస్టు గడువు ముగిసింది. అయినా ఒక్క బస్సు కూడా మళ్లీ ఫిట్‌నెస్ టెస్ట్‌కు వెళ్లలేదు. కానీ రోడ్లపై మాత్రం తిరుగుతున్నాయి. కండీషన్‌లో లేని బడి బస్సులను రోడ్లపైకి అనుమతి ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఆర్టీఏ అధికారులు ఇప్పటికైనా అలసత్వం వీడాలని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సాధారణ వాహనాలను నిత్యం తనిఖీలు చేపట్టే అధికారులు విద్యాసంస్థల బస్సులను ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఫిట్‌నెస్ టెస్ట్ ఇలా..

ఫిట్‌నెస్ పరీక్షల్లో బస్సు ఇంజిన్ పని తీరు పరీక్షిస్తారు. కండీషన్‌లో ఉందా లేదా? టైర్లు, ఇన్సూరెన్స్ పేపర్లు, పొల్యూషన్ సర్టిఫికెట్, బస్సు కిటికీలు, ఎంట్రన్స్, ఎమర్జెన్సీ కిటికీలు, బస్సు బాడీ పార్టు.. ఇవన్నీ సక్రమంగా ఉన్నాయా? లేవా అని ఆర్టీఏ కార్యాలయంలో అధికారి తనిఖీలు నిర్వహిస్తారు. బస్సు కండీషన్‌లో ఉందని భావిస్తే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీంతో బస్సులు రోడ్డుపై తిరగవచ్చు.

పాటించాల్సిన నిబంధనలు

పాఠశాల విద్యార్థులకు అనుమతులు ఉంటే పాఠశాల విద్యార్థులు మాత్రమే తీసుకువెళ్లాలి. కళాశాల విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలను తరలించేందుకు ఉపయోగించకూడదు. కళాశాలల కోసం అనుమతులు తీసుకున్న బస్సులు కేవలం కళాశాలల విద్యార్థులను తరలించేందుకు మాత్రమే వినియోగించాలి. ఇతరులను తరలించేందుకు అనుమతులు ఉండవు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాక బస్సు ఎక్కడి నుంచి ఎక్కడికి తిరగాలనే విషయంలో అనుమతులు తీసుకోవాల్సిఉంటుంది. అనుమతి ఉన్న ప్రాంతాల్లో మధ్య బస్సులు తిరగాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదు. ఏ విద్యాసంస్థ అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీఏ అధికారులు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

ముడుపులు ముట్టచెబితే

జిల్లా రవాణాశాఖలో ముడుపులు ముట్టచెబితే ఎలాంటి బస్సులనైనా రోడ్లపై తిప్పవచ్చనే ధీమా విద్యాసంస్థల యాజమాన్యాల్లో కనిపిస్తోంది. కొందరు అధికారులు ఫిట్‌నెస్ పేరుతో రూ.వేలల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. విద్యాసంస్థలు తెరుచుకుంటుండగా ఇప్పటివరకు ఒక్క బస్సు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందలేదు. అయినా ఆర్టీఏ అధికారులు స్పందించడంలేదు. అధికారులు, విద్యాసంస్థల యజమానుల తీరుతో బడి పిల్లలు భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించాలని, కండీషన్‌లో లేని బస్సులకు అనుమతి ఇవ్వొద్దని కోరుతున్నారు.

త్వరలోనే నిర్వహిస్తాం



గత మే నెల 15వ తేదీతో విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ గడువు ముగిసింది. త్వరలో మళ్లీ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహిస్తాం. విద్యాసంస్థల యాజమాన్యాలు కండీషన్‌లో ఉన్న బస్సులనే రోడ్లపై తిప్పాలి. అనుమతి, ఫిట్‌నెస్ లేకుండా తిరిగితే జరిమానా విధిస్తాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు.

– కిషన్‌రావు, జిల్లా ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారి

ప్రభుత్వ కార్యాలయాల ముస్తాబు



విద్యుత్ దీపాలతో అలంకరించిన కేటీపీఎస్ 7వ దశ సీఈ కార్యాలయం

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పాల్వంచలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు చేశారు. కేటీపీఎస్ 7వ దశ, 5,6 దశల చీఫ్ ఇంజనీర్ల కార్యాలయాలు, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రత్యేక ఉప కలెక్టర్(భూసేకరణ) కార్యాలయం, జలవనరుల ఈఈ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను శనివారం విద్యుత్‌దీపాలతో అలంకరించారు. –పాల్వంచరూరల్/పాల్వంచ

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని రామటాకీస్ రోడ్డులోని దుర్గన బస్తీకి చెందిన పున్నంసింగ్ కళ్యాణ్ శుక్రవారం పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్‌కు వెళ్లాడు. అక్కడ గొడవ జరుగుతుండగా ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇల్లెందుకు చెందిన విక్కి కోరి, నరేష్ కర్రతో దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లు ప్రశ్నార్థకమే

పర్సా శతజయంతి స్మారక ఉపన్యాసంలో వక్తలు



మాట్లాడుతున్న సాయిబాబు

సింగరేణి(కొత్తగూడెం): పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని, ఆయా సంస్థలను ప్రైవేటీకరిస్తే ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్లు ప్రశ్నార్థకమేనని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ శత జయంతి వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 150 రైల్వే లైన్లను ప్రైవేటీకరించిందని ఆరోపించారు. భవిష్యత్‌లో రైల్వే సంస్థలో ఉద్యోగాలు కూడా ఉండబోవని అన్నారు. పౌరసరఫరాల సంస్థను ప్రైవేటీకరిస్తే ఆహార భద్రత సమస్య తలెత్తుతుందని అన్నారు. ప్రభుత్వం ఆరోగ్యం విద్య, ఆహారంపై దృష్టి పెట్టడం లేదన్నారు. కార్పొరేట్‌లు ఇచ్చే విరాళాల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందుతున్న పార్టీలు తిరిగి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు సంపద తెచ్చిపెట్టే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. జాతి సంపద రక్షణనకు ప్రజలు తిరగబడాల్సిన సూచించారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రమా మాట్లాడుతూ శ్రామిక మహిళల చట్టబద్ధ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ నాయకులు మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే, ఆ పార్టీ నిందితులకే వత్తాసు పలుకుతోందని విమర్శించారు. వేతనాలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సమస్యలపై మాట్లాడకుండా మతాల మధ్య చిచ్చు పెడుతూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. హక్కులను కాపాడుకునేందుకు పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, మందా నర్సింహారావు, బి.మధు, కె.బ్రహ్మాచారి, ఏజే రమేష్, జిలకర పద్మ, డి.వీరన్న, ఎస్‌ఏ నబీ, పిట్టల అర్జున్, గద్దల శ్రీను, వెంకటమ్మ, ధనలక్ష్మి సత్య, దొడ్డ రవి, సూరం ఐలయ్య, ఎంవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- ఫ్యాన్లు, ఏసీల వాడకంతో ఓవర్ లోడ్.
- లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: ఎండల తీవ్రతతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం పరిమితికి మించిపోయింది. ఈ క్రమంలో సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లపై అధికలోడు పడి తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై కొద్ది రోజులుగా ఓవర్ లోడ్ పడుతోంది. లోడ్ తగ్గించేందుకు శనివారం రూ.1.5 కోట్లతో మరో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ ప్రతాప్ తెలిపారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాగా రోజూ 10 వేల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఎండల తీవ్రత వినియోగం 30 వేల యూనిట్లకు పెరిగిందని ఏఈ తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, ఇందిరానగర్ కాలనీ, రాహుల్‌గాంధీనగర్, హమాలీకాలనీ, వనమాకాలనీ, జయమ్మకాలనీ, వికలాంగులకాలనీ, తెలంగాణనగర్, వెంకటేశ్వరహిల్స్ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీనగర్, యాకయ్యబజార్, వెంగళరావుకాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ, బొల్లోరిగూడెం ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను ఎస్‌ఈ బీకాసింగ్, డీఈ నందయ్య, ఏడీఈ లక్ష్మణ్ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని నిజాంపేట గ్రామ సమీపంలో శనివారం కారు, బైక్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆంగోత్ భిక్షపతి అనే వ్యక్తి ధనియాలపాడు గ్రామపంచాయతీ సేవ్యాతండా నుంచి బైక్‌పై ఇల్లెందుకు వెళ్తుండగా భద్రాచలం నుంచి హనుమాన్ భక్తులు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భిక్షపతికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టిజన్లతో వెట్టి చాకిరీ !

- తీరుమారని అధికారులు
- జెన్‌కో సీఎండీ దృష్టి సారించాలని కోరుతున్న కార్మికులు



కేటీపీఎస్ 7వ దశ కోల్ ప్లాంట్‌లో ఓ అధికారి కారు కడుగుతున్న కార్మికుడు

పాల్వంచ : కేటీపీఎస్‌లో పనిచేసే ఆర్టిజన్ కార్మికులతో అధికారుల వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. సంస్థ పనుల కంటే సొంత అవసరాలకే కొందరు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారుల ఇళ్లలో చెట్ల పెంపకం, చెత్త ఏరివేత, పరిసరాలు శుభ్రం చేయించడం, బట్టలు ఉతికించడం, కార్లు కడిగించడం, కుటుంబసభ్యులు షాపింగ్‌కు వెళ్లినప్పుడు లగేజీ మోయించడం వంటి పనులు చేయిస్తున్నారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అభివృద్ధికి తమతో పనులు చేయించాల్సి ఉండగా పాలేర్లలా వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కాగా, ఇలాంటి వారిపై సరైన చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు మహిళా ఆర్టిజన్ కార్మికులైతే బయటకు చెప్పుకోలేక లోలోన మథనపడుతున్నట్లు సమాచారం. అధికారులకు ఎదురు చెబితే విధుల్లో ఇబ్బందులకు గురి చేస్తారని అంటున్నారు. ఈ వ్యవహారంపై జెన్‌కో సీఎండీ దృష్టి సారించాలని కోరుతున్నారు.

వానరానికి మేళతాళాలతో అంతిమ సంస్కారం



వానరానికి అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు: హనుమజ్జయంతి రోజునే మృతిచెందిన వానరానికి జై శ్రీరాం నినాదాల మధ్య అంతిమ సంస్కారం నిర్వహించిన ఘటన ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురంలో శనివారం చోటుచేసుకుంది. కోతి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఓ వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన కోతి అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. దీంతో హనుమాన్ జయంతి రోజున వానరం మృతిచెందడం అరిష్టమని భావించిన స్థానికులు మేళతాళాలతో అంతిమ సంస్కారం నిర్వహించారు.

డెంగీతో యువకుడి మృతి



రవికుమార్ (ఫైల్)

చర్ల రూరల్ : చర్ల మండలంలో డెంగీ జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. చినమిడిసిలేరు గ్రా మానికి చెందిన శ్యామల రవికుమార్(25)డెంగీతో శుక్రవారం రాత్రి భద్రాచలం ఆస్పత్రిలో మృతి చెందాడు. రవికుమార్ జ్వరంతో బాధపడుతుండగా మొదట సత్యనారాయణపురం పీహెచ్‌సీలో వైద్యం చేయించామని, అక్కడ తగ్గకపోవడంతో 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, మండలంలోని లక్ష్మీ కాలనీలోనూ డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఐదు రోజుల వ్యవధిలోనే జ్వరంతో మృతి చెందిన ఘటన మరువకముందే మళ్లీ జ్వరాలు విజృంభించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని యాచకుడి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. కూనవరం రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు ఉన్న యాచకుడు మృతి చెందాడు. బ్లూ రంగులో ఉన్న గళ్ల లుంగీ, గచ్చకాయ రంగులో ఉన్న షర్టు, కుడి చేతికి ఆరెంజ్ రంగు తాడు ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు 87126 82160 నంబరులో లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎద్దు తొక్కడంతో కూలీ మృతి

దుమ్ముగూడెం : ఎద్దు తిరగబడి తొక్కడంతో కూలీకి వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన దుమ్ముగూడెం మండలం కే.రేగుబల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొర్సా సీతయ్య తన ఎద్దును టేకులపల్లికి చెందిన ఒకరికి అమ్మాడు. ఎద్దును కొనుగోలు చేసిన వ్యక్తి.. దాన్ని గోదావరి నది దాటించేందుకు కె.రేగుబల్లికి చెందిన కొర్సా వెంకటేష్‌ను కూలీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఎద్దు వెంకటేష్‌పై తిరగబడింది. కిందపడేసి గుండె, కడుపు భాగంలో తొక్కింది. పక్కనున్న వారు కాపాడే ప్రయత్నం చేసినా.. ఎద్దు వారిపైనా తిరగబడడంతో భయపడి దూరంగా వెళ్లిపోయారు. ఆ తర్వాత వారు వచ్చి చూడగా తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

దుమ్ముగూడెం : మండలంలోని అంజుబాక గ్రామ సమీపంలో శనివారం ఓఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామంలోని రైతు కుర్సం చంద్రయ్యకు చెందిన ఎద్దు మేత మేసుకుంటూ త్రీ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో ఎద్దు మృతి చెందడంతో రైతు మనోవేదనకు గురవుతున్నాడు. రూ.40 వేల నష్టం జరిగిందని, అధికారులు స్పందించి పరిహారం చెల్లించాలని మాజీ సర్పంచ్ మడకం నాగేంద్రబాబు కోరారు.

చందా ఇవ్వలేదని గ్రామస్తుల దాడి



వివరాలు తెలుపుతున్న బాధితులు బ్లెసీన్, రాజు

ములకలపల్లి: బొడ్రాయి ప్రతిష్ఠకు చందా ఇవ్వలేదని రెండు నెలల క్రితం కుల బహిష్కరణ చేశారని, శుక్రవారం బంధువులు చనిపోతే చూసేందుకు వెళ్లిన తమపై దాడి చేశారని చాపరాలపల్లి గ్రామానికి చెందిన గద్దల బ్లెసీన్, రాజు దంపతులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. గద్దల రాజు, భార్య బ్లెసీనా, పిల్లలు కృప, ఏంజిల్, అత్త నాగపోగు రాధలు చాపరాలపల్లి ఎస్సీ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. రెండు నెలల క్రితం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ నిమిత్తం గ్రామంలో చందాలు వసూలు చేశారు. ఈ క్రమంలో చందా అడుగగా, తన ఆర్థికపరిస్థితి బాగాలేదని తెలిపాడు. తర్వాత ఎప్పుడైనా ఇస్తానని వివరించాడు. ఈ క్రమంలో రాజుకు, గ్రామస్తులకు వివాదం జరిగింది. దీంతో కులబహిష్కరణ చేస్తామని పేర్కొనడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని బాధితుడు రాజు ఆరోపించాడు. కాగా శుక్రవారం గ్రామంలో రాజు బంధువు చనిపోగా మృతదేహాన్ని చూసేందుకు కుటుంబ సమేతంగా వెళ్లారు. అక్కడికి వచ్చిన కొందరు రెచ్చగొట్టడంతో తమపై గ్రామస్తులు దాడి చేశారని పేర్కొన్నారు. రోడ్డుపైకి ఈడ్చుకుంటూ తీసుకొచ్చి, కులంలోకి రావద్దని చేయి చేసుకున్నారని వాపోయారు. న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్సై రాజమౌళిని వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో
- ఏపీలోని జీలుగుమిల్లిలో ఘటన



ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

అశ్వారావుపేటరూరల్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఏపీలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామానికి చెందిన దాసరి రాంబాబు(45) తోపాటు కుటుంబ సభ్యులు, బంధువులంతా కలిసి ఆటోలో ఏపీలోని జంగారెడ్డిగూడెం మండలం ద్వారకా తిరుమల ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రమణక్కపేట గ్రామ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రాంబాబు, అతని భార్య ఉషారాణికి తీవ్రగాయాలయ్యాయి. కొప్పుల గణేష్, విజయలక్ష్మితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాంబాబును ఖమ్మం రిఫర్ చేయగా, పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే రాంబాబు మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.